# ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలి



**-కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ**

తిరుమల,ఆగస్ట్ 2ప్రభాతవార్తప్రతినిధి: దేశ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ తెలిపారు. శనివారం ఉదయం ఆయన కుటుంబంతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. అదనపు ఈఓ వెంకయ్యచౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



వెంకటగిరి, ఆగస్టు 2, ప్రభాతవార్త

పట్టణంలోని అమ్మవారిపేట చెరువులోకి తోటి స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లి ఎనిమిదో తరగతి చదువుతున్న చైతన్య హేమంత్ పడి మృతి చెందాడు. హేమంత్ ఉపాధ్యాయ నగర్ లోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం తోటి స్నేహితులతో కలిసి పాఠశాల పక్కనే ఉన్న చెరువు వద్దకు ఈత కొట్టేందుకు సరదాగా వెళ్లారు.చెరువులో పెద్ద గుంట ఉండడంతో విద్యార్థులు అందులో చిక్కుకున్నారు. పక్కనే చేపలు పడుతున్న గిరిజనులు వారిని రక్షించారు. అయితే హేమంత్ మునిగిపోవడంతో మత్స్యకారులు గుర్తించలేకపోయారు. బంధువులు చెరువులో ఎంత గాలించినా మృతదేహం గుర్తించలేకపోయారు. తోటి విద్యార్థులు హేమంత్ చెరువులో దిక్కున పరిగెత్తుకుంటూ వెళ్లారని అందరికి చెప్పడంతో నమ్మారు. శనివారం బాలుడే మృతదేహం నీటిలో తేలడంతో బంధువులు వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎంఈఓ బాబయ్య పాఠశాలకు వెళ్లి విచారించారు.

# నాడు జగన్ గొంతు నొక్కితే: కూటమి ఆదుకుంటుంది

**శ్రీకాళహస్తిలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి**





శ్రీకాళహస్తి,ఆగస్టు 2 ప్రభాతవార్త

జిల్లాలో వ్యవసాయధాన్యాగారంగా ఉన్న శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఎపిసీడ్స్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు,డెప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, యువ నాయకుడు మంత్రి నారాలోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకాలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పరిపాలించిన జగన్ గొంతు నొక్కితే నేడు కూటమి నాయకులు రైతులను ఆదుకొనుటకు అన్నదాత సుఖీభవ పథకం అందుతుందని ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నదాతలకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించుటకు దశల వారిగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. రైతులు పండించినపంటలను నిల్వ చేసుకొని గిట్టుబాటుధరలు లభించే వరకు గోడౌన్స్ ఆవశ్యమని ప్రతి మండలంలో గోదాములు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గత వైకాపా పాలనలో జగన్ రైతుల గొంతు నొక్కితే నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వ సహాకారంతో అన్నదాత సుఖీభవ అంటూ ఆర్థిక సహాయం చేస్తున్నారన్నారు.కలెక్టర్ వెంకటేశ్వరన్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో 1.34 లక్షల మంది రైతులకు 106 కోట్లు రూపాయలు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఏదైనా కారణాలతో సొమ్ములు బ్యాంకు ఖాతాలో జమ కాకుంటే నిరాశ పడవద్దన్నారు. మళ్ళీ అక్టోబర్‌లో రెండవ విడత సహాయం అందుతుందన్నారు. వ్యవసాయాధికారులతో సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. రైతుల బ్యాంకు ఖాతాలు సక్రమంగా లేకుంటే ఆ బాధ్యత వ్యవసాయశాఖదే అని కలెక్టర్ స్పష్టం చేసారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ జేడి ప్రసాద్ ప్రసంగించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ తిరుపతి శాసనసభ్యురాలు,రాష్ట్ర గ్రీనరి బ్యూటిఫికేషన్ సంస్థ చైర్మెన్ సుగుణమ్మ, ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, శ్రీకాళహస్తి వ్యవసాయశాఖ అధికారి రమేష్‌రెడ్డి, స్థానిక నాయకులు చెంచయ్యానాయుడు, విజయ కుమార్, మునిరాజానాయుడు, చలపతి నాయుడు, పాపిరెడ్డి, రవీంద్రనాధ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభివృద్ధి చంద్రన్నతోనే సాధ్యం

**మంత్రి మండిపల్లి**





రొంపిచర్ల, ఆగస్టు 2 ప్రభాతవార్త

ప్రజాభివృద్ధి కూటమి ప్రభుత్వ సారధి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం రొంపిచర్లలో అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం నిధులను విడుదల చేసారు. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి ప్రసంగిస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 13నెలల్లోనే ఫించన్ల పెంపు, ఉచిత బియ్యం, తల్లికివందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈనెల 15న మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు పథకాన్ని ప్రారంభిస్తామన్నారు. రాయలసీమలోని చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో సాగునీరందించేందుకు గోదావరి నుంచి కాలువల ద్వారా నీరు తీసుకొస్తున్నామన్నారు. గతంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి నీరు లేకుండానే కాలువలు తవ్వారని గుర్తు చేసారు. గానుగచింతలో 10సంవత్సార క్రితం నిర్మించిన ప్రాజెక్టు ముంపు భూములకు ఇంత వరకు పరిహారం మంజూరు చేయలేదన్నారు. నాడు-నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలకు రంగులు వేసి రూ. 1300కోట్లు కాజేశారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో వ్యవసాయ పంటల సాగుకు అన్నదాత సుఖీభవలో రూ. 5వేలు, పిఎం కిసాన్ పథకం ద్వారా రూ. 2వేలు వంతున 25753మంది రైతుల ఖాతాల్లో రూ. 138కోట్లు జమ చేశారని తెలిపారు. అదే విధంగా 2వ విడత అక్టోబర్, 3వ విడత జనవరిల్లో రైతులకు జమ అవుతుందన్నారు. మామిడి రైతులకు రూ. 135కోట్లు సబ్సీడీ నిధులు వచ్చాయన్నారు. త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ చల్లా రామచంద్రారెడ్డి, వ్యవసాయశాఖ జెడి మురళీకృష్ణ, తహశీల్దార్ అమరనాథ్, కురబ కార్పోరేషన్ డైరెక్టర్ రమణ, సర్పంచు ఇబ్రహీంఖాన్, నాయకులు జడల రాజంద్ర, మేడసాని రవినాయుడు, రఫీ, ఓబులేష్‌రెడ్డి, అమరనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఎన్ఎస్‌యులో భాషోత్సవ జాతీయ సదస్సు

**- వర్సిటీలో 14వరకు డేస్ స్కాలర్స్ కు స్పాట్ అడ్మిషన్లు**
**- ఈ ఏడాది వర్సిటీలో ఐకేఎస్ నూతన కోర్సు ప్రారంభం**
**-మీడియాతో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి**




తిరుపతి విద్య ఆగస్టు 2 ప్రభాత వార్త

జాతీయ సంస్కృత వర్సిటీ,ఉత్కల పీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ప్రస్థానత్రయంలో భాషోత్సవం పేరుతో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు.శనివారం వర్సిటీలో ఆయన " మీడియాతో మాట్లాడుతూ సంస్కృత విద్యాపీఠం నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ జాతీయ విశ్వవిద్యాలయంగా అవతరించిందన్నారు. వర్సిటీలో ఎన్ఈపి2020 విధానాన్ని అమలు చేస్తూ పలు నూతన కోర్సులను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. డిగ్రీ ఆనర్స్ తో పాటు రీసెర్చ్ ఓరియెంటెడ్ ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు నడుపుతున్నామన్నారు.అలాగే వర్సిటీలో యూజీ,పీజీ కోర్సులలో పదుల సంఖ్యలో మిగిలి ఉన్న సీట్లకు ఈనెల 14వ తేదీ వరకు కేవలం డేస్కాలర్స్ కి స్పాట్ అడ్మిషన్లు కల్పించనున్నట్లు తెలిపారు.స్థానిక విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాటే ఎన్ ఎస్ యూలో ఈ ఏడాది నుంచి యూజీ, పీజీలో ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ (ఐకేఎస్) కోర్సును నూతనంగా ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.వర్సిటీలో నిర్మించిన శ్రీ స్వామినారాయణ సంప్రదాయ అక్షరపురుషోత్తమ మందిరాన్ని సైతం ఆదివారం జాతీయ సదస్సుకు హాజరయ్యే ప్రముఖులు ఆవిష్కరిస్తారని తెలిపారు.అలాగే సదస్సుకు వీసీలు, ఒరిస్సా గవర్నర్,ఉత్తరాఖండ్ సీఎం హాజరవుతారని చెప్పారు.అలాగే స్వామి నారాయణ సంప్రదాయ సంస్థలతో విశ్వవిద్యాలయం పరస్పర అవగాహనా ఒప్పందం చేసుకుని అమెరికా,ఇగ్లండ్, అబుదబి,నేపాల్లో ఉన్నటువంటి సంస్థలతో కలసి విశేష పరిశోధనలు జరపనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో రిజిస్ట్రార్ వెంకటనారాయణ, ఉత్కల పీఠం డైరెక్టర్ జ్ఞానరంజన్ పండా, పీ ఆర్ ఓ ప్రొఫెసర్ రమేష్ బాబు,ఏపీఆర్ ఓ డాక్టర్ కనపాల కుమార్

# రైతుల అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం

**ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్**



గూడూరు, ఆగస్టు 2, ప్రభాతవార్త

రైతుల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలో సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనతో పాటు సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా తదితరులు పాల్గొని రైతులకు అన్నదాత సుఖీభవ నగదు చెక్కులు అందజేశారు. శనివారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు నగదు చెక్కులు అందజేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రత్యక్ష ప్రసారాన్ని అక్కడి వారు తిలకించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిన పంటలు ఏర్పాటు చేశారు. ఆ స్టాల్స్‌ను ఎమ్మెల్యే సునీల్ కుమార్ అధికారులు పరిశీలించారు. ఏయే పంటలు సాగు చేశారో రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ మొదటి విడతగా రైతుల ఖాతాల్లో ఏడు వేల రూపాయల వంతున నగదు జమ చేయడం జరిగిందన్నారు. రెండో విడత అక్టోబర్, మూడో విడత నగదు జనవరిలో రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. వైకాపా పాలనలో రైతుల కోసం జగన్మోహన్ రెడ్డి చేసిందేమీ లేదన్నారు. రైతుల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన వివరించారు. చెప్పి మాట ప్రకారం ఒక్కో పథకం అమలు చేస్తున్నామన్నారు. మాది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని అన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుకు 20 వేలు అందిస్తామని చెప్పారు. మొదటి విడతలో భాగంగా 7000 వేల రూపాయలు ప్రతి రైతు ఖాతాలో జమ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సొసైటీ అద్యక్షుడు కరుణా కర్ రెడ్డి, నాయకులు శీలం కిరణ్ కుమార్,భాస్కర్ రెడ్డి,పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లు రాజు, దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కిషోర్ నాయుడు, రహీమ్, వాటంబేటి శివకుమార్, మట్టం శ్రావణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హరోం హరా.. వేల్ మురుగా

**- వానగుట్టపల్లిలో ఆడి 17 వేడుకలు..**
**కొక్కీలకు వేలాడుతూ భక్తుల విన్యాసాలు !!**



కుప్పం,ఆగస్టు 2 ప్రభాతవార్త

మండలంలోని వానగుట్టపల్లి గ్రామం శనివారం హరోం హరా .. వేల్ మురుగా నినాదాలతో మారో మ్రోగింది. గ్రామ సమీపంలో వెలసిన శ్రీ సుబ్రమణ్యస్వామికి ఆడి 17 సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. వానగుట్టపల్లి చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక తమిళనాడు నుంచి సైతం మొక్కులు కలిగిన భక్తులు పెద్ద సంఖ్యలో గ్రామానికి చేరుకుని సా వ్యమివారికి పూజలు జరిపారు. మొక్కులు కలిగిన భక్తులు అధిక సంఖ్యలో వివిధ రకాల శూలాలు నోట్లో, ఒంటికి గుచ్చుకుని వచ్చారు. మరికొందరు భక్తులు లారీలో సిడేల్ మానుకు కొక్కీలతో వేలాడుకుంటూ వచ్చి కావడులు చెల్లించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను జరిపారు. రాత్రి వరకు గ్రామంలో భక్తుల తాకిడి అధికంగా కన్పించింది. ఆడి 17 సందర్భంగా గ్రామంలో వివిధ రకాల దుకాణాలు సైతం ఏర్పాటయ్యాయి.

## లడ్డూప్రసాదానికి 310 ఏళ్ళు !

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:



శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం తరువాత భక్తులు అంతటిపవిత్రంగా భావించే తిరుమలలడ్డూకు 310 ఏళ్ళ చరిత్ర ఉంది. శ్రీవారి ప్రసాదాల్లో లడ్డూకు ఉన్న ప్రాధాన్యత ప్రధానం. దేశవిదేశాల నుంచి నిత్యం కొండకు వచ్చే భక్తులు దివ్యమంగళరూపం దర్శనం తరువాత తమ జన్మధన్యమైందని భావించి ప్రసాదంగా లడ్డూలను తమవెంట పవిత్రంగా తీసుకెళతారు. గత ఏడాదిన్నర కాలంలో లడ్డూల నాణ్యత,రుచి ఎంతో పెరిగింది. ప్రస్తుతం రోజుకు 3-4 లక్షల లడ్డూలు తయారవుతున్నాయి.. ఐదులక్షల లడ్డూల తయారీకి 185 కిలోల ఆవునెయ్యి, 200కిలోల శనగపిండి, 400కిలోలు చక్కెర, 35కిలోల జీడిపప్పు, 17.50కిలోల ఎండు ద్రాక్ష, 10కిలోల కలకండ, 5కిలోల యాలకులు వినియోగిస్తున్నారు.

**లడ్డూలలో "ప్రోక్తం(సాధారణ)లడ్డు":**

సాధారణంగా అన్ని రకాల దర్శనాలకు ఇచ్చే ప్రసాదం లడ్డు ఇది. సేవల్లో, సర్వదర్శనంలో భక్తులకు ఉచిత లడ్డూగా అందిస్తున్నారు. దీనిబరువు 175గ్రాములు, దీని ధర 50రూపాయలు. ఈ లడ్డూనే అందరికీ తెలిసింది. రోజుకు 4లక్షల వరకు తయారుచేస్తుంటారు..

**"ఆస్థానంలడ్డు":**

ఈ లడ్డూప్రసాదాలను ప్రత్యేక సందర్భాల్లో తయారుచేసి అత్యంత ప్రముఖులకు, ఆలయ గౌరవ అతిధులకు మాత్రమే ఇస్తారు. సాదాంణంగా ఈ లడ్డూల విక్రయాలు జరగవు. 750గ్రాముల బరువున్న వీటి తయారీలో అధికమొత్తంలో నెయ్యి, సారపప్పు, ముంత మామిడి, ఎండుద్రాక్ష, యాలకులు,కుంకుమపువ్వుతో తయారు చేస్తారు. రుచి అమోఘం.

**"కల్యాణోత్సవం లడ్డు":**

కల్యాణోత్సవం ఆర్జితసేవలో పాల్గొనే భక్తులకు ఈ కల్యాణలడ్డు(పెద్దలడ్డు)ఉచితంగా ఇచ్చేవారు. ప్రస్తుతం ఈ పెద్ద లడ్డూలను గృహస్థభక్తులు, సాధారణ భక్తులకు 200 రూపాయలకు (నిల్వఉన్నవరకు)విక్రయిస్తున్నారు. ఆలయంలోపల వగపడిలో విక్రయించేవాటిని కూడా లడ్డూవితరణ శాల కౌంటర్‌లకు చేర్చారు. సుమారు 700గ్రాముల బరువు ఉంటుంది. కల్యాణోత్సవం ఇతర కొన్ని సేవల్లో పాల్గొన్న భక్తులకు ఇస్తారు. 1715 ఆగస్ట్ 2న బూందీప్రసాదం మాత్రమే ఉండగా తరువాత లడ్డూల తయారీ ప్రారంభమైంది.

# సమస్యల్లో జనం.. సమయపాలన లేని అధికారగణం



ఖాళీ కుర్చీలతో ఉన్న వీఆర్ఓల గది

తొట్టంబేడు ఆగస్టు 3 ప్రభాతవార్త

తొట్టంబేడు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు అన్ని ఒకే చోట ఏర్పాటు చేయాలనే మహోన్నత లక్ష్యంతో నాటి మంత్రి స్థానిక శాసనసభ్యుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఒకే చోట అన్ని కార్యాలయాలు ఏర్పాటు చేసారు.అయితే రెవెన్యూ కార్యాలయం శిథిలావస్థ దశలో ఉంది. గతంలో ఇక్కడ పని చేసిన రెవెన్యూ అధికారులు దొరికినోళ్ళకు దొరికినంత అన్నట్లు సర్దుబాటు చేసుకున్నారు.నేడు మండలంలోని చిట్టత్తూరు,బోనుపల్లి, చియ్యవరం తదితర ప్రాంతాల్లో దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలు. గత వైకాపా పాలనలో జగనన్న కాలనీలో భూ కుంభకోణాలు ఇలా రక రకాల సమస్యలతో మండలం సతమతమౌతుంది. అయితే ఇక్కడ పని చేసే అధికారులు 'పలుకుబడితో' కొలువుకు వచ్చి ప్రజలంటే లెక్కలేని తనంతో వ్యవహారిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇక ఇక్కడ పని చేసే ఉద్యోగులు ఒకరికి ఒకరు సంబంధం లేదు. సమన్వయం లేదు. సమాధానం చెప్పె దిక్కులేదు. సమస్యలతో వచ్చిన వారు చెట్ల కింద కూర్చొని ఏ అధికారి ఎన్నిగంటలకు వస్తారో ఏమో తెలియక సతమతమౌతున్నారు.

**మేమింతే . . .**

మేమింతే మీరు ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండి మాకు నచ్చిన టైం ప్రకారం వస్తాం ఉండాల్సిన వారు ఉంటారు పోవాల్సిన వారు పోతారు ఇది సాక్షాత్తు రెవెన్యూ అధికారుల పనితీరుపై నిదర్శనం.

**అధికారులకోసం రైతులు పడిగాపులు**

శనివారం తొట్టంబేడు మండల తహశీల్దార్ కార్యలయంలో ఉదయం 11 గంటలైన ఏ అధికారి రాకపోవడం వారి కోసం పడిగాపులు కాస్తున్న రైతులు ఎప్పుడు వస్తారో ఏమో అంటూ నిట్టూర్చారు. అయితే శనివారం శ్రీకాళహస్తిలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాలకు రెవెన్యూ అధికారి కలెక్టర్ రావటంతో కొందరు అధికారులు వెళ్ళి ఉండవచ్చు.అయితే ప్రతి రోజూ ఎందరో తిప్పలు పడుతున్నారు.తొట్టంబేడు మండల డిప్యూటి తహశాల్దార్ తీరు పై అనేక విమర్శలు వెలువెత్తుతున్నాయి.ఆయన టైంకు రారు.పనులు చేయరు.పలు రెవెన్యూ పనుల కోసం రైతులు మండల ప్రజలు కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోరు.వారి పై నిర్లక్ష్యం వ్యవహరిస్తూ సమాధానాలు చెబుతున్నారు.తొట్టంబేడురెవెన్యూ కార్యాలయ నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు వాపోతున్నారు.ఇక్కడ నూతనంగావచ్చిన తహశీల్దార్ ఈ దుస్థితిపై దృష్టి సారించాల్సి ఉంది.అధికారుల తీరుపై విమర్శలపై వివరణ కోరగా ఈ ఆరోపణలు, సమస్యలు తన దృష్టికి రాలేదని పరిశీలించి సరిదిద్దగలమని వివరణ ఇచ్చారు.తాను కొత్తగా బాధ్యతలు తీసుకున్నానని పరిష్కరిస్తామన్నారు.

# వేడుకొందామా...

**గోవిందుని ఉత్సవాలకు కొండంతా అందాలు**

తిరుమల,ఆగస్ట్ 2ప్రభాతవార్తప్రతినిధి:



సప్తగిరులపై తొమ్మిదిరోజులుపాటు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయం పరిసరాలు ,మాఢవీధుల్లో గ్యాలరీలు ఏర్పాటు, తాగునీరు కల్పించేందుకు నీటికొళాయిలు మరమ్మతులు, మాఢవీధుల్లో స్వామివారి దశావతారాల ప్రతిమలతో స్వాగత ఆర్చిలు, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా భక్తులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దే పనులు మొదలయ్యాయి. బ్రహ్మోత్సవాలకు కొండంతా సర్వాంగసుందరంగా ముస్తాబవుతోంది. ఇలవైకుంఠంగానే తీర్చిదిద్దుతున్నారు. మాఢవీధుల్లో భక్తుల సౌకర్యార్థం గ్యాలరీల పనులు చేపడుతున్నారు. దక్షిణమాఢవీధిలో వాహనసేవల సమయంలో ఇనుపకంచె దాటిరాకుండా ఉండేందుకు బలమైన గోడను నిర్మిస్తున్నారు. భక్తుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకున్నారు. అధునాతన సిసికెమెరాలు, లైటింగ్స్ అన్నీ మార్పుచేస్తున్నారు.

## వైకాపానుంచి పెద్దపంజాణి ఎంపిపి బహిష్కరణ

పెద్దపంజాణి, ఆగస్టు 2 ప్రభాతవార్త



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి పెద్ద పంజాణి మండల ఎంపిపి రెడ్డెప్పను బహిష్కరణ చేస్తున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా వైకాపా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నా రు. పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరించడంతో పాటు పార్టీ నాయకుల మనోభావాలు దెబ్బతీసేలా రెడ్డెప్ప ప్రవర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాలతో రెడ్డెప ్పను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. అతనికి పార్టీకి ఇకపై ఎలాంటి సంబంధం లేదన్నారు.

## తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహనా కార్యక్రమం

తిరుపతి విద్య, ఆగస్టు 2 ప్రభాతవార్త



ప్రపంచ తల్లిపాల వారోత్స వాలు (ఆగస్టు 1 నుండి 7 వరకు) నిర్వహించబడునని ఈ సందర్భంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఆగస్టు 2, శనివారం స్థానిక బాలాజీ కాలనీలోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థునులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్రం ప్రాజెక్ట్ అసోసియేట్ డా. ఇ. కోన ప్రభ మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేయడం,అవగాహన పెంపొందించడం, తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహించడం ద్వారా తల్లి, శిశువును సంరక్షించుకోవాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుండి 7 వ తేదీ వరకు ప్రపంచవ్యాప్తంగా తల్లిపాల వారోత్స వాలు నిర్వహించబడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, మహిళా అధ్యయన కేంద్రం ప్రాజెక్ట్ అసిస్టెంట్ డా.ఇంద్రాణి మరియు విద్యార్థును లు పాల్గొన్నారు.

## ఉత్తమ సింగిల్‌విండో సొసైటీగా కోసలనగరం

**విజయపురం, ఆగస్టు 2 ప్రభాతవార్త:**



ఉత్తమ సింగిల్‌విండో సొసైటీగా కోసలనగరం నిలిచిం దని సొసైటీ ఛైర్మన్ బాబుయాదవ్ తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉత్తమ నగదు లావాదేవీలు జరిపినందుకు గాను ఉత్తమంగా ఎంపికైందని తెలిపారు. రేపు సోమవారం విజయవాడ మక్కినేని బసవయ్య విజ్ఞాన కేంద్రంలో ఛైర్మన్, సీఈవోలను సత్కరిస్తున్నట్లు తెలిపారు.

## తరిగొండ వెంగమాంబ విగ్రహానికి ఘనంగా పుష్పాంజలి

తిరుపతి రవాణ,ఆగస్టు 2 ప్రభాతవార్త



మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ విగ్రహానికి టిటిడి వెంగమాంబ ప్రాజెక్టు అధికారులు ఘనంగా పుష్పాంజలి ఘటించారు. శనివారం ఉదయం శ్వేత విభాగం అధికారులు ఎంఆర్‌పల్లి కూడలిలోని వెంగమాంబ విగ్రహానికి పుష్పాంజలి, కర్పూర హారతులిచ్చారు. అన్నమాచార్యకళామందిరంలో బి.మంజుల, టి.తేజోవతి బృందం వెంగమాంబ కీర్తనలతో సంగీత కచేరి నిర్వహించారు. చంద్రశేఖర్ బృందం హరికథ గానం చేశారు.

## పులి వాహనంపైశ్రీ ధర్మరాజుల స్వామి

**పుత్తూరు రూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త:**



పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మ రాజుల స్వామి బ్రహ్మోత్స వాల సందర్భంగా శని వారం రాత్రి పులి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. ఉదయం ఆలయంలోని స్వామివారికి, అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం తీర్థోత్స వం, పాండవ కౌరవ జననం కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఆలయ ఆవరణలో మహాభారతం మండపంలో ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పి.స్వర్ణలత భాగవతారనిచే మహా భారత హరికథ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణతో వేపాకు తోరణాలతో సుందరంగా అలంకరించారు. బక్తులు స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ ద్రౌపదీదేవి ఆలయంలో శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్స వాలు సందర్భంగా పుత్తూరు గీతాసేవా సమాజం సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో ఉన్న మహాభారత మండపంలో గీతా పారాయణవనం ప్రవచనాలు భజనలు, భక్తి పాటలు కార్యక్రమాలను నిర్వహించారు.

## తల్లిపాలు వారోత్సవాలు

**పుత్తూరు రూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త:**



తల్లిపాలు వారోత్స వాల్లో భాగంగా తొరూరు గ్రామంలో గర్భవతులు, బాలింతలు, గ్రామ ప్రజలు అందరూ పాల్గొన్నారు. ఇందులో తల్లిపాలు యొక్క ప్రాముఖ్యత గురించి తల్లిబిడ్డకు పాలు ఇవ్వడం ఎంత ముఖ్యమో, పుట్టిన గంట లోపు బిడ్డకు ముర్రిపాలు తాగించడం ఎంతో శ్రేష్టం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి తెలిపారు. అనంతరం గర్భవతులకు, బాలింతలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.సుమలత, కె.వజ్రం, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

## ఎస్వియులో యాంటీ ర్యాగింగ్ పోస్టర్ విడుదల

**తిరుపతి విద్య, ఆగస్టు 2 ప్రభాత వార్త**



తెలుగు నాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ ఎస్ వి యు శాఖ ఆధ్వర్యంలో వర్సిటీ క్యాంపస్‌లో ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించే యాంటీ ర్యాగింగ్ పోస్టర్లు విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెజిస్ట్రార్ భూపతి నాయుడు పాల్గొని,తన చేతులు మీదగా యాంటీ ర్యాగింగ్ పోస్టర్ ను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ ఎస్వి వర్సిటీ లీడర్ బిషాటి వెంకటేష్ నాయుడు మాట్లాడుతూ ర్యాగింగ్ అనేది చట్ట ప్రకారం శిక్షార్హమైన నేరం. విద్యార్థుల రక్షణ కోసం, ఇటువంటి చర్యలను ఖచ్చితంగా నివారించాల్సిన అవసరం ఉంది. ఎవరికైనా ర్యాగింగ్ సంబంధిత సమస్యలు ఎదురైతే,వారు నేరుగా అధికారులకు లేదా టీఎన్ఎస్ఎఫ్‌కు తెలియజేయవచ్చు. మేము పూర్తి గోప్యతతో సహాయం అందిస్తాము" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సందీప్, షారీఫ్,హస్వంత్, విజయ్,రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రెయిన్బో ఈ స్మార్ట్ స్కూల్‌కు అవార్డులు రివార్డులు...

రేణిగుంట ఆగస్టు 2 ప్రభాతవార్త



రేణిగుంట పట్టణంలోని రెయిన్బో ఈ స్మార్ట్ స్కూల్ విద్యార్థులు ఎస్ ఓ ఎఫ్ ఒలంపియాడ్స్ 2024..25 లో అవార్డులు రివార్డులు సాధించారు. ఒకటవ తరగతి విద్యార్థి పి .శక్తి సవరణ సాయి జోనల్ గోల్డ్ మెడల్ తో పాటు 5000 నగదు కైవసం చేసుకున్నాడు. ఆర్. సిద్ధార్థ జోనల్ బ్రొంజ్ మెడల్ 1000 నగదు, పి. సోహాన్ వర్ధన్ బ్రోంజ్ మెడల్ 1000 నగదు, వి. త్రిషాల్ బ్రోంజ్ మెడల్ 1000 నగదు, పి.కుషల్ బ్రోన్జ్ మెడల్ 1000 నగదు, తేజస్ ప్రకాష్ బ్రౌంజ్ మెడల్ 1000 నగదు, ఎస్.మొహరీన్ 500, ఆసియా కౌసర్ 500, ఏ. కావ్యశ్రీ 500 గిఫ్ట్ వోచర్లు బహుమతులుగా గెల్చుకున్నారు. పాఠశాల విద్యార్థులు సాధించిన బహుమతులు పాఠశాల విశిష్టతను పెంపొందింపజేశాయని పాఠశాల కరస్పాండెంట్ అత్త ఉల్లా ఖాన్ అన్నారు. విద్యార్థుల ప్రతిభకు సాన పట్టిన ఉపాధ్యాయులు, ప్రోత్సహించిన తల్లిదండ్రులను ఆయన అభినందించారు.

## గుంతలు పూడ్చండి మహాప్రభో....

రేణిగుంట ఆగస్టు 2 ప్రభాతవార్త

రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చడమో లేక మరమ్మత్తులు చేయించమో తక్షణం చేపట్టాలని ఆటో యూనియన్ నాయకులు సభ్యులు రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో శనివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విఆర్ రావణన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రేణిగుంట పంచాయతీలోని రోడ్లన్నీ గుంతల మయంగా మారి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోలు నడుపుకోవడం చాలా కష్టంగా ఉందన్నారు. ఆటో రిపేర్లకు వందల రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తుందన్నారు. రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని వాపోయారు. ఆటోలు నడుపుతున్న డ్రైవర్లకు, ప్రయాణికులకు భద్రత లేకుండా పోయిందన్నారు. వెంటనే రోడ్లను మరమ్మత్తులు చేపట్టకపోతే నిరసన ఉధృతం చేస్తామని హెచ్చరిస్తూ సర్పంచ్ నాగేషం కు వినతి పత్రం సమర్పించారు. నిరసన తెలిపిన వారిలో ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు విఆర్.రావణన్, యూనియన్ అధ్యక్షుడు నవీన్, నాయకులుసురేష్,సూరి,నాగరాజు,వాలాజ నాయుడు, గౌరీ శంకర్, కుమార్, శీను తదితరులు ఉన్నారు.

## ప్రధాని ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసిన రాస్ కృషి విజ్ఞానం కేంద్రం

రేణిగుంట ఆగస్టు 2 ప్రభాతవార్త



రేణిగుంట మండలం చైతన్య పురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లోని వారణాసి జిల్లా వేదికగా 20వ విడత నిధులు విడుదల, ప్రధానమంత్రి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులకు వీక్షించే అవకాశం కల్పించింది. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం, వ్యవసాయాధికారి శ్రీనివాసులు, విశ్రాంత ఆత్మ ప్రాజెక్ట్ ఉప సంచాలకులు విజయచంద్ర నాయుడు, కె.వి.కె శాస్త్రవేత్తలు జిల్లాలోని వివిధ మండలాల నుండి 105 మందికి పైగా రైతులు పాల్గొన్నారు. కే.వి.కే హెడ్ డా.ఎస్.శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం నిర్వహిస్తున్న వివిధ పథకాలు, కృషి విజ్ఞాన జిల్లాలో చేపడుతున్న అంశాలపై వివరించారు. మోడీ ప్రసంగంపై వివరణ ఇస్తూ దేశంలోని 9.7 కోట్లకు పైగా రైతులకు 20,500 కోట్ల రూపాయల నగదును రైతుల ఖాతాలకు పి. ఏం కిసాన్ పెట్టుబడి సహాయాన్ని బదిలీ చేస్తున్నారని, అందులో భాగంగా తిరుపతి జిల్లాకు సంబంధించి సుమారు 1.39 లక్షలకు పైగా రైతులకు సుమారు 27.8 కోట్ల రూపాయల నగదు బదిలీ జరిగిందని తెలిపారు.

## తల్లిపాల వారోత్సవంలో వైద్యశాఖ అధికారులు

**నారాయణవనం, ఆగస్టు 2 ప్రభాతవార్త :**



నారాయణవనంలో జరగుతున్న తల్లిపాల వారోత్స వాలను స్థానిక డాక్టర్ రాగసుధ, ఐసిడిఎస్ సూప ర్‌వైజర్ బేబీ తదితరులు పాల్గొన్నారు. శనివారం నారాయణవనంలోని అంగన్‌వాడీ సెంటర్ల్-1ను సందర్శించి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలను ఇవ్వడంతో ఆ బిడ్డ ఆరోగ్యవంతంగా పెరుగుతుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను తల్లిపాలను కాదనకుండా వేరే పాలను ఉపయోగించరాదన్నారు. అలాగే బాల్య వివాహాలు చేయడం కలిగే అనర్థాల గురించి వివరించారు. ఇకపోతే చుట్టు ప్రాంతాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. సిబ్బంది నాగభూషణ, తల్లులు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

## సప్రవాహనంపై ఊరేగిన ద్రౌపతిదేవి సమేత ధర్మరాజులస్వామి

**నారాయణవనం, ఆగస్టు 2 ప్రభాతవార్త :**



మండలకేంద్రంలోని నారాయణవనంలో ప్రసిద్ధి చెందిన ద్రౌపతిదేవి సమేత ధర్మరాజులస్వామి వారి వార్షిక బ్రహ్మోత్స వాల్లో భాగంగా రెండవరోజు శనివారం సాయంత్రం సప్రవాహనంపై వెంటకృష్ణ పాలెం పంచాయతీ నాగిలేరు గ్రామంలో ఘనంగా ఊరేగారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని హారతు లు పట్టారు.ఆలయ ధర్మకర్త దేశప్పరెడ్డి, నాగిలేరు గ్రామస్తులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

## కళ్యాణ వేంకటేశ్వరునికి ఘనంగా ఊంజల్‌సేవ

**నారాయణవనం, ఆగస్టు 2 ప్రభాతవార్త :**



నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 11గంటలకు స్వామి అమ్మవార్లకు ఘనంగా కల్యాణోత్స వం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నెయ్యి దీపాలను వెలిగించారు. ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, సిబ్బంది కైలాసం, సాంబయ్య, మోహన్, మూర్తి, మురళి, అర్చకులు పాల్గొన్నారు.

## బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీతో ప్రజలను మోసం చేసిన బాబు

**నారాయణవనం, ఆగస్టు 2 ప్రభాతవార్త :**



రాష్ట్ర వైఎస్సాఆర్‌కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు మండలంలోని సముదాయం, బొబ్బరాజుపాలెం, వెత్తలతడుకు, కీళగరం పంచాయతీలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీనూ జరిగిన కార్యక్రమంకు ప్రజల నుంచి విశేష స్పందన అభింది. ఈ సందర్భంగా ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, మంవల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయులు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఎన్నికల్లో గెలవడం కోసం కల్లబొల్లి హామీలను కురిపిం గెలవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయులు, రాకేష్ కిరణ్, సర్పంచులు నాగూరు, గా ఒదీమతి, సుబ్రమణ్యంరెడ్డి, మురళి, సాయిరవి కుమార్, ధర్మలింగం, అధిక సంఖ్యలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు

## కొత్త విద్యుత్ లైన్ల కోసం పెద్ద వృక్షాలు నరికివేత



***పాకాల, ఆగస్టు 2, ప్రభాతవార్త*** పాకాల మండలం దామలచెరువు పంచాయతీ కుక్కలపల్లె రోడ్డుకు అనుకోని నూతన విద్యుత్ లైన్స్ పేరుతో కొత్తగా చేపడుతున్న విద్యుత్ లైన్ల నిర్మాణం కొరకు ఎడాపెడా రోడ్డులకు ఇరువైపులా విద్యుత్ స్థంబాలు నాటుకుంటూపోతూ దాదాపు వంద ఏళ్ళు పైబడి భవిష్యత్తు ఉండే మర్రి వృక్షాలను సైతం తెగనరికేసి వాటి మనుగడే ప్రశ్నార్థంగా మార్చేసే ప్రయత్నం పాకాల మండలంలో ప్రస్తుతం విచ్చలవిడిగా సాగుతోంది. ఇప్పటికే పర్యావరణంలో జరిగే పలు మార్పులకు కాగా ఇప్పటికే రోడ్ల విస్తరణ పేరుతో ఉన్న పెద్ద చెట్లను తొలగించేసి ఎక్కడ చెట్లను కొత్తగా నాటి పెంచకపోగా, ఇప్పుడు పల్లెలకు మూడు పేస్ లైన్స్ కోసం కనీసం పల్లెల్లో ఉండే రోడ్లుకి ఇరువైపులా ఉన్న చెట్లను కూడా వదిలి పెట్టడం లేదు. ప్రతి నిత్యం పచ్చదనం కోసం అహర్నిశలు కష్టపడి కోట్లు ఖర్చు పెట్టి చెట్లను నాటమని చెప్పే అటవీ శాఖ అధికారులు కొత్త విద్యుత్ లైన్ల పేరుతో పర్యావరణానికి పచ్చని చెట్లకు జరిగే నష్టం గురించి ఏ మాత్రం పట్టించుకోకపోవడం విడ్డూరం అంటున్న స్థానిక ప్రజలు. విద్యుత్ కాంట్రాక్టర్లు యదేచ్చగా చెట్లను కొమ్మలు వాటి సుదుల నరికి వేయడం ఎందుకు అటవీ శాఖ ఆపలేకపోతున్నారు. వీరికి పర్యావరణ అనుమతులు ఉన్నాయా అని ఉన్నతాధికారులను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చెట్లను నరికివేసి విద్యుత్తు లైన్లను లాగిన కాంట్రాక్టర్లు ఇప్పటి వరకు ఎన్ని ఎకరాలలో మొక్కలు నాటి వాటిని సంరక్షణ చేశారో ప్రజలకి స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

## అన్నదాత సుఖీభవ నిధులు విడుదల

**పాకాల, ఆగస్టు 2, ప్రభాతవార్త**



పాకాల మండలంలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ సమ్మాన్ పథకం ద్వారా మూడు కోట్ల 52 లక్షల రూపాయలు పంటలకు పెట్టుబడి సాయం కింద 5029 మంది లబ్ధిదారుల రైతులకు వారి ఖాతాలో జమ చేస్తున్నామనీ, రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గ పాకాల మండలం కే. వద్దేపల్లి గ్రామంలోని రైతు సేవ కేంద్రం నందు శనివారం రోజున అన్నదాత సుఖీభవ పీ.ఎం కిసాన్ మొదటి విడత ప్రారంభించిన తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సాల్, సింగల్ విండో ఛైర్ పర్సన్ కృష్ణమనేని సావిత్రి, ప్రభాకర్, పాకాల మండల జడ్పిటిసి నంగా పద్మజా బాబురెడ్డి, ఏవో హరిత. సర్పంచులు వరలక్ష్మి, చంగల్ రాయులు. మహేష్ కుమార్, సుధాకర్, వీఆర్వోలు పంచాయతీ సెక్రటరీలు, సిబ్బంది, రైతులుకలిసి ప్రారంభించారు.

## కోర్టు ప్రాంగణంలో తాగునీటి వసతి కల్పిస్తాం

- జ్యూడిషియల్ కోర్టు న్యాయమూర్తి

**సత్యవేడు, ఆగస్టు 2 ప్రభా**



కోర్టు ప్రాంగణంలో తాగునీటి వసతి కల్పిస్తామని తిరుప న్యాయమూర్తి వెంకట నాగరాజు తెలిపారు. శనివారం స్థానిక న్యాయమూర్తి వెంకట నాగరాజును మర్యాదపూర్వకంగా క మాట్లాడుతూ వివిధ కేసులకు సంబంధించి రోజువారిగా వస్తు కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం కేసులకు సంబంధించి రోజువారి విచారణ కొనసాగడంతో త్వరితగతిన కేసులు పరిష్కరిస్తున్నామన్నారు. అయితే ఇక్కడి నుంచి ప్రస్తుతం ఉన్న కోర్టును వేరే చోటుకు తరలించే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటికే పోలీసు శాఖకు తగిన సూచ నలు కూడా ఇచ్చామన్నారు. తదనంతరం రానున్న ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్స వం పురస్కరిం చుకుని జాతీయ జెండా దిమ్మెకు రంగులు వేసే పనులను న్యాయమూర్తి వెంకటనాగరాజు పరిశీలించారు.

## అన్నదాత సుఖీభవతో రైతులకు చేయూత : ఎమ్మెల్యే

**సత్యవేడు, ఆగస్టు 2 ప్రభాతవార్త:**



అన్నదాత సుఖీభవ పథకంతో రైతులకు చేయూతనం దించినట్లు ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. శనివారం సత్యవేడు బేరిశెట్టి కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన 29653 మంది రైతులకు అన్నదాత సుఖీభవ తొలి విడత నగదు కింద రూ.20.38 కోట్లు మెగా చెక్కును ఎమ్మెల్యే ఆదిమూలం పంపిణీ చేశారు. ఈ మేరకు మండలాల వారిగా అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల సంఖ్య, వారి ఖాతాల్లో జమ అయ్యే మొత్తంను ఎమ్మెల్యే వివరించారు. మండలం రైతులు మొత్తం(కోట్లలో) కోట్లు రూపాయలు రైతులకు పంపిణీ చేశారు. ఇంక ఎవరైనా అర్హులైన లబ్ధిదారులు ఉంటే వారు అందుబాటులో ఉన్న రైతు సేవా కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మె ల్యే సూచించారు. ఈ నెల 15నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించ నున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు పురుగు మందులు పిచికారి చేసే డ్రోన్‌ను పరిశీలించిన అనంతరం రైతులు ఏర్పాటు చేసిన కూరగాయల స్టాల్‌ని ఎమ్మెల్యే, అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. సత్యవేడు బేరిశెట్టి కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని 7, మండలాలకు చెందిన 29653 మంది రైతులకు అన్నదాతన సుఖీభవ తొలి విడుత నగదు కింద రూ.20.38 కోట్లు మంజూ ౦ందని తెలిపారు. ఈ మేరకు మండలాల వారిగా అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారులు సంఖ్య, వారి ఖాతాల్లో జమ అయ్యే మొత్తంను వివరించారు. ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు, మహిలా శక్తి పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు శంకర్‌రెడ్డి ప్రకటించారు.అనంతరం పురుగు మందులు పిచికారి చేసే డ్రోన్‌ను పరిశీలించిన అనంతరం రైతులు ఏర్పాటు చేసిన కూరగాయల స్టాల్‌ను టీడీపీ పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్‌లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ పార్టీప్రముఖ నాయ కులు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మస్తాన్ యాదవ్, జడ్పీటీసీ విజయలక్ష్మి రెడ్డి, రామాంజులనాయుడు, సతీష్ నాయుడు, తిరుమలరెడ్డి, పద్మనాభ రాజు, వీకేఎన్ పరమశివం, గోపినాథ్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు, లోకనాథ్‌రెడ్డి, నరేంద్ర ముదిరాజ్, షణ్ముగం ముదిరాజ్,కోళ్ళ చిన్నాముదిరాజ్,ఈశ్వరయ్య రెడ్డి, ప్రభుత్వ అగ్రికల్చర్ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## సమస్యలు పరిష్కార దిశగా మండల సమావేశం జరగాలి

-అధికారుల, ప్రజాప్రతినిధుల సమన్వయ సహకారంతోనే అభివృద్ధి

-తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు మూలం చంద్రమోహన్‌రెడ్డి



***తిరుపతిరూరల్, ఆగస్టు 02 ప్రభాతవార్త:*** మండల సమావేశం మొక్కుబడిగా కాకుండా... సమస్యలు పరిష్కారం దిశగా జరగాలని...గత మండల సమావేశంలో ప్రస్తావించిన సమస్యలను ఏమేరకు పరిష్కరించారో తెలియజేయాలని తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు మూలం చంద్రమోహన్‌రెడ్డి మండల అధికారులను ప్రశ్నించారు. శనివారం తిరుపతిరూరల్ మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన జరిగింది. సమావేశం ప్రారంభంలో ఇటీవల ఆకాల మృతి చెందిన చెర్లోపల్లి సుభాషిణికి మౌనం వహించి, సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు పలు సమస్యలు ప్రస్తావించారు. మంగళం పిహెచ్‌సి కేంద్రం, బిటిఆర్ కాలనీలో నిరుపయోగంగా ఉన్న రూమ్‌లను టిడిపి కార్యకర్తలు స్వాధీనం చేసుకున్నారని, ప్రజా ప్రయోజనాల కోసం రూమ్‌లను సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపిటిసి సభ్యుడు లక్ష్మయ్య కోరారు. మంగళంలో ఏవ్వరు లేని అనాధ కుష్టు వ్యాధితో గత 7సంవత్సరాలుగా బాధపడుతన్నా...ఇంతవరకు ఆయన పెన్షన్ ఇవ్వలేదని గాంధీపురం ఎంపిటిసి సభ్యుడు జైకర్ ఆవేదన వ్యక్తం చేసాడు. అవిలాల గ్రామ పంచాయతీలో విద్యుత్ స్తంబం శిధిలావస్తకు చేరుకుని, కూలేస్థితిలో ఉందని, విద్యుత్ అధికారులు స్పందించి కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళిన ఫలితం లేదని అవిలాల ఎంపిటిసి సభ్యుడు హరికృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు. సూర్యఘర్ సద్వినియోగం చేసుకోవడం వల్ల జీరో విద్యుత్ బిల్లు వస్తుందని విద్యుత్ అధికారులు తెలిపారు. ఆర్ అండ్ అధికారులు స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా లైన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. తిరుపతిరూరల్ మండలంలో భూ ఆక్రమణలకు అడ్డుకట్టవేయాలని కోరారు. అనంతరం ఎంపిపి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ మండల సమావేశంలో తలెత్తిన సమస్యలను వచ్చే మండల మీట్‌లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపిడిఓ రామచంద్ర, వైస్ ఎంపిపిలు విడుదల మాధవరెడ్డి, యశోధ, తిరుపతిరూరల్ తహశీల్ధార్ రామాంజులనాయక్, మండల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గత పదిరోజులలో ఏడు రోడ్డు ప్రమాదాలు...

..చెర్లోపల్లి-శ్రీనివాసపురం రోడ్డుకు స్పీడ్ బ్రేకర్స్, జీబ్రా లైన్స్ ఏర్పాటు

**తిరుపతిరూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** చెర్లోపల్లి- శ్రీనివాస మంగాపురంలో రోడ్డులో గత పదిరోజులలో ఏడు రోడ్డు ప్రమాదాలు జరిగాయని పెరుమాళ్ళపల్లి గ్రామ సర్పంచ్ జోగి మోహన్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేసారు. శనివారం జరిగిన మండల సమావేశంలో రోడ్డు ప్రమాదాలను వివరించారు. అర్ అండ్ బి రోడ్డులో స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని, రోడ్డు దాటుటకు జీబ్రా లైన్స్ ఏర్పాటు చేయించాలని కోరారు. దీనిపై అర్ అండ్ బి ఏఇ ధనలక్ష్మీ సానుకూలంగా స్పందించి, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మూలం చంద్రమోహన్‌రెడ్డి,ఎంపిడిఓ రామచంద్ర, వైస్ ఎంపిపి విడుదల మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

## తనపల్లిలో అన్నదాత సుఖీభవ...పిఎం కిసాన్ పథకం ప్రారంభం

**తిరుపతిరూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త:**



తిరుపతిరూరల్ మండలానికి సంబంధించి అన్నదాత సుఖీభవ...పిఎం కిసాన్ పథకాన్ని శనివారం తనపల్లి గ్రామ పంచాయతీలో ప్రారంభించారు. తిరుపతిరూరల్ మండలంలోని 2919మంది రైతులకు రూ.1.94కోట్ల రుపాయాలను రైతుల ఖాతాలలో జమ చేయబడునని మండల వ్యవసాధికారి ఏవి.సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోరే ప్రభుత్వమని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు అమలులో భాగంగా అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ పథకానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని తెలిపారు. అర్హులైన ప్రతి రైతుకు ఏటా రూ.20వేల రూపాయలు ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. మొదటి విడతగా రూ.7వేల రుపాయాలు జమ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఇచ్చిన రూ.13500 రూపాయలు కంటే రూ.6500 రూపాయలు అదనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుచానూరు మార్కెట్ యార్డు ఛైర్మెన్ యు.మౌనిక, మల్లంగుంట సింగిల్ విండో ఛైర్మెన్ మధుశేఖర్, డైరెక్టర్లు చిరంజీవి, మోహన్‌రెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు మునికృష్ణయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గుడి స్థలాన్ని కబ్జా చేసిన హెడ్ కానిస్టేబుల్, అతని అనుచరుడు

- చర్యలు తీసుకోవాలని ఎస్పీ, కలెక్టర్‌కు వినతి



***తిరుపతి హెల్త్, ఆగస్టు 2 ప్రభాతవార్త :*** స్థానిక రవీంద్ర నగర్‌లో కాపురముంటున్న హెడ్ కానిస్టేబుల్, అతని అనుచరుడు గుడి స్థలాన్ని సైతం కబ్జా చేసి రూములు కట్టుకుని బాడుగులకు ఇవ్వడం దారుణమని,దీనిపై ఎస్పీ, కలెక్టర్ వెంటనే స్పందించి అతనిపై చర్యలు తీసుకోవాలని రవీంద్రనగర్ వాసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం వారు మీడియాతో మాట్లాడారు. రవీంద్రనగర్ 1వ క్రాస్‌లో కొంత స్థలాన్ని శ్రీ వినాయక స్వామి ఆలయ నిర్మాణానికి వదిలి పెట్టడం జరిగిందన్నారు. అయితే వెస్ట్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మల్లికార్జున, నాగేశ్వరరావు అను వారు అసోసియేషన్‌లో సభ్యులుగా ఉంటూ శ్రీ వినాయక స్వామి వారి స్థలానే కబ్జా చేయడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానికులు వారిని ప్రశ్నించగా మీ దిక్కు ఉన్న చోట చెప్పుకోండి అని మమ్మల్ని భయబ్రాంతులకు గురిచేస్తున్నారని బాధపడ్డారు. వెంటనే ఎస్పీ, కలెక్టర్ స్పందించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని ఆలయ నిర్మాణానికి తోడ్పాటు అందించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో రవీంద్రనగర్ వాసులు పాల్గొన్నారు.

## అవధాన బాల భాస్కరము పుస్తక ఆవిష్కరణ

**తిరుపతి హెల్త్, ఆగష్టు 2 ప్రభాతవార్త :**



అవధాన విద్యలోని పలు రకాల విన్యాసా లకు నిలయం అవధాన బాల భాస్కరము పుస్తమని తిరుపతికి చెందిన శతావధాని, ప్రవచన కర్త ఉప్పలధడియం భరత్ శర్మ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ మాట్లాడారు. ఇప్పటి వరకు తాను దేశ విదేశా లలో 3 శతావధానాలు, 87 అష్టావధానాలు నిర్వహించామని తెలిపారు. అందులో భాగంగా మొదటి 50 అష్టావధానాలను అవధాన బాల భాస్కరము పేరుతో పుస్తక రూపంలోకి తీసుకు వచ్చామన్నారు. గత నెల 25,26,27వ తేదీల్లో తనకు గురువు అయిన త్రిభాషా మహా సహస్రావధాని బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ వారణాసిలో నిర్వహించిన శతావధానంలో ఆవిష్కరించడం జరిగిందన్నారు. పుస్తకాన్ని ప్రదర్శించి, వివరాలను తెలియజేశారు. అనంతరం అవధాన బాల భాస్కరము పుస్తక ప్రచురణకు ఆర్థిక, హార్థిక సహకారం అందించిన కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఏఐసీసీ సభ్యురాలు కిడాంబి ప్రమీలమ్మను శతావధాని, ప్రవచన కర్త ఉప్పలధడియం భరత్ శర్మ అభినందించారు. అంతకు ముందు భరత్ శర్మను ప్రమీలమ్మ శాలువ, పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ చక్ర ఆస్పత్రి, ఉడ్‌సైడ్ హోటల్స్ అధినేత డాక్టర్ అర్చన, పుస్తకానికి ముందుమాట రాసిన శతవధాని ఆముదాల మురళీ పాల్గొన్నారు.

## ఎస్వీయూలో బీటెక్ ( స్వీడన్ ) ప్రవేశాలకు ఆహ్వానం

**తిరుపతి విద్య, ఆగస్టు 2 ప్రభాత వార్త**

ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ (స్వీడన్) కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం స్వీడన్లోని ఖీ బ్లెకింగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీఖీ తో జరిగిన పరస్పర అంగీకార ఒప్పందం ప్రకారం ఎస్వీయూ బీటెక్ 4సంవత్సరాల కోర్సు కొనసాగుతోందని తెలిపారు.అయితే ఈ ప్రోగ్రాం మూడు సంవత్సరాలు ఎస్వీయూలో ఒక సంవత్సరం స్వీడన్ లోని బెక్లింగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విద్యార్థులు చదవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.కావున 2025-26 విద్యా సంవత్సరానికి ఈ ప్రోగ్రాంలో చేరదలచిన విద్యార్థులు ఈనెల 4 వ తేదీ నుంచి 14 వతేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.వర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్ల విభాగం ద్వారా ఆసక్తిగల విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశాలు పొందవచ్చని తెలియజేశారు.మరిన్ని వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్సైట్ ను సంప్రదించాలని సూచించారు.

## ప్రదీప్ కుమార్ ఆనంద్‌కు డాక్టరేట్ ప్రదానం

**తిరుపతి విద్య, ఆగస్టు 2 ప్రభాత వార్త**



శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మనస్తత్వం శాస్త్ర విభాగంలో పరిశోధన చేసినందుకు గాను అమరరాజా సంస్థలో సైకాలజిస్ట్ గా పనిచేస్తున్న బి.ప్రదీప్ కుమార్ ఆనంద్ కు డాక్టరేట్ డిగ్రీ ఇస్తున్నట్లుగా యస్వీయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రకటించారు.వీరు సైకాలజీ విభాగ విశ్రాంత ఆచార్యులు వి.శ్రీకాంత్ రెడ్డి పర్యవేక్షణలో" సైకో సోషియల్ ఫ్యాక్టర్స్ ఇన్ఫ్లూయన్సింగ్ ఓటింగ్ బిహేవియర్" అనే అంశంపై పరిశోధన చేశారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**వడమాలపేట, ఆగస్టు 2 ప్రభాతవార్త:**

తిరుపతి-చెన్నై జాతీయ రహదారిలో మండలంలోని పాదిరేడు బైపాస్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాదిరేడుకు చెందిన వరదయ్య(65) మృతి చెందాడు. శనివారం ఉదయం 10 గంటలకు వడమాలపేట నుంచి పాదిరేడుకు మోటారు బైక్‌పై వెళుతూ బైపాస్‌రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి చెన్నై వెళుతున్న లారీ ఢీకొంది. దీంతో బైక్ నడుపుతున్న వరదయ్య తీవ్రంగా గాయపడ్డాడు. వెనుక కూర్చున్న తట్నేరి గొల్లపల్లికి చెందిన వసంతకు చెయ్యి విరిగి గాయపడింది. వీరిని 108 వాహనంలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. చికిత్స పొందుతూ వరదయ్య సాయంత్రం మృతి చెందాడు. వడమాలపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# గూడూరు డివిజన్

## మహిళల అభివృద్ధే చంద్రబాబు లక్ష్యం : ఎమ్మెల్యే



నాయుడుపేట, ఆగస్టు 2 ప్రభాతవార్త : రాష్ట్రంలో మహిళలను అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని సూళ్ళూరుపేట శాసన సభ్యులు నెలవల విజయశ్రీ తెలిపారు. ప్రభుత్వం ఎన్‌టిఆర్ భరోసా ద్వార నూతనంగా మంజూరు చేసిన ఫించన్లును నాయుడుపేటలో ఎమ్మెల్యే చేతుల మీదుగా మహిళలకు శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లడుతూ అవ్వతాతలను ఆదుకోవాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పెన్షన్లును నాలుగువేలకు పెంచడం జరిగిందన్నారు. రాష్ట్రంలో నూతనంగా లక్ష ఇరవైవేలు పెన్షన్లు మంజూరు చేసినట్లు తెలియజేశారు. సార్వత్రిక ఎన్నికల్లో సూపర్‌సిక్స్ ద్వార చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామిలను నెరవేర్చుతు న్నారన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపి నెలవల సుబ్రమణ్యం, మాజీ ఏఎంసి చేర్మేన్ శిరసనంబేటి విజయ భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి పేరంశెట్టి శ్రీరామ్‌ప్రసాద్, కట్టా వెంకట రమణారెడ్డి,ఓజిలి మండలపార్టీ అధ్యక్షుడు విజయ కుమార్ నాయుడు, సంచి కృష్ణయ్య, కమిషనర్ పజులుల్లా, ఎంపిడిఓ సురేష్‌బాబు,ప్రమీలారాణి తదితరలు తెదేపా నాయకులు పాల్గోన్నారు.

## వెంకయ్యకి భారతరత్న ఇవ్వాలి



చిల్లకూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త : దేశం గర్వించదగ్గ స్వాతంత్ర సమర యోధుడు, తెలుగువాడు, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్యకి భారతరత్న ఇచ్చి ఆ మహనీయుని సేవలను గౌరవించాలని భారతీయ శిక్షణ మండల్ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు దేశిరెడ్డి ప్రజేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. చిల్లకూరు మండలం పాలిచర్ల వారి పాలెం ఉన్నత పాఠశాలలో పింగళి వెంకయ్య 149వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పింగళి వెంకయ్య చిత్రలేఖన పోటీ ఆయన జీవిత చరిత్రపై, వ్యాసరచన, ఉపన్యాసాలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి అనసూయ, చంద్రశేఖర్, మాధవయ్య, లావణ్య, సంధ్య, లీల, నాగభూషణమ్మ, సుగుణ, విద్యుల్లత, రవీంద్ర, డివి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కురుగొండ్ల



వెంకటగిరి, ఆగస్టు2 ప్రభాతవార్త: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని ఏఎంసి కార్యాలయం వద్ద రైతులకు అన్నదాత సుఖీభవ పథకంకు సంబంధించిన 20 కోట్ల 77 లక్షల రూపాయల జంబో చెక్కును అందజేశారు. ఎన్నికల ముందు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తానని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని ఇది ఇప్పుడు నెరవేర్చినట్లు చెప్పారు. రైతులకు సబ్సిడీదారులకు పనిముట్లు కూడా ఇచ్చిన ఘనత చంద్రబాబు నాయుడునని తెలిపారు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం రైతులను విస్మరించిందని తెలిపారు. బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ ఎస్ఎస్ఎన్ నాయుడు మాట్లాడుతూ కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరిపాలన రైతులకు ఎంతగానో మేలు చేస్తున్నట్లు తెలిపారు. పిఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు 2000 రూపాయల నగదు రాష్ట్రంతో కలిపి వేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ తనుజా రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథం, మాజీ ఏఎంసీ చైర్మన్ సీసీ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు పప్పు చంద్రమోళి రెడ్డి, దక్కిలి ఎంపీపీ రాజశేఖర్, నాయకులు సత్యనారాయణ, శివారెడ్డి, బాబు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పద్మవ్యూహంలో సూళ్లూరుపేట



సూళ్లూరుపేట, ఆగస్టు 2 ప్రభాతవార్త: సూళ్లూరుపేట పట్టణం పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా వసతులు లేకపోవడంతో ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుని ఉంది. ముఖ్యంగా బాపూజీవీధి, కచ్చేరివీధి, కూరగాయల మార్కెట్ సెంటర్‌తో పాటు హోలీక్రాస్ జంక్షన్ నుంచి లలితా జ్యుయలరీ వరకు ఉన్న రోడ్లపై ఎక్కడపడితే అక్కడ రోడ్డు మార్జిన్‌పై వ్యాపారాలు చేసుకునే వారు ఆక్రమించు కోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొని ఉన్నా పోలీసులు, మున్సిపల్ అధికారులు అప్పుడప్పుడు తూతూమంత్రంగా ట్రాఫిక్ నియంత్రణ చేపడు తున్నారే గాని శాశ్వతమైన పరిష్కారం చూపకపోవడంతో యధా విధిగా ట్రాఫిక్ రద్దీ ఎక్కువవుతోంది. ఒకవైపు ఆటో స్టాండ్లు ఎక్కడ పడితే అక్కడ జిఎన్‌టి రోడ్డుపై ఏర్పాటు చేసుకుని ఉండటంతో అటు ఆటోలు, ఇటు కంపెనీ బస్సులతో జిఎన్‌టి రోడ్డు మొత్తం ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుంది. ఇటీవల సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఉద్దీ ఉండే ప్రాంతాల్లో తన సిబ్బందితో పర్యటించి ట్రాఫిక్ నియంత్రణకు అందరూ సహకరించాలని వ్యాపారులకు రోడ్డు మార్జిన్‌పై విక్రయాలు జరిపే వారికి విజ్ఞప్తి చేశారు. కానీ, ఇదేమీ పట్టనట్లుగా ఎక్కడపడితే అక్కడ ఇష్టా రాజ్యంగా తమ సొంత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అటు వ్యాపారాలను ఇటు ఆక్రమణలను యథేచ్ఛగా చేస్తున్నారు. ఈ విషయమై స్పందించి చర్యలు తీసుకుని ట్రాఫిక్ నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

## పాఠశాల, ఆసుపత్రుల్లో తనిఖీలు చేసిన సివిల్ జడ్జి



వెంకటగిరి, ఆగస్టు 2 ప్రభాతవార్త : పట్టణంలోని బీసీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల, ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వం ఆసుపత్రి పై వచ్చిన ఫిర్యాదు మేరకు ఆకస్మిక తనిఖీలు చేపట్టిన వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి విష్ణు వర్మ తెలిపారు. పట్టణంలోని మహాత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి వంట సామగ్రి, స్టాకు, సరుకుల వివరాలు, పరిసర ప్రాంతాలని ఆయన పరిశీలించారు. వంటశాలలో ఉన్నటువంటి ముడి సరుకులను నాసి రకంగా ఉన్నట్లు గుర్తించి వాటిని శాంపిల్స్ తీసుకున్నారు. రూమ్‌లో చెడిపోయిన కూరగాయలు, వాడి పోయిన క్యారెట్, లోకల్ పామ్ ఆయిల్ వంటి వాటిని గుర్తించి వాటిని పరిశీలించారు. అక్కడ పరిశుభ్రంగా లేకపోవడంతో అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. క్లస్టర్ హెల్త్ ఆసుపత్రిలో ఓపి మందుల కేంద్రము, ల్యాబ్ టెక్నీషియన్,ఎక్స్ రే ప్లాంట్, రక్త పరీక్ష కేంద్రాల విభాగాలను ఆయన క్షుణంగా పరిశీలించారు. పేషెంట్లను వైద్యం సక్రమంగా అందుతుందా లేదా అని వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగుల పట్ల వైద్యులు సమయస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల లీగల్ అడ్వైజర్ కమిటీ మెంబర్ రాజేష్, రాజారాం, కిషోర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### తల్లిపాల వారోత్సవాలు

దొరవారిసత్రం, ఆగస్టు 2 ప్రభాతవార్త: మండల పరిధిలోని అక్కరపాక పంచా యతీలో కృష్ణాపురం గ్రామంలోని అంగనవాడి పాఠశాలలో శనివారం తల్లి పాల వారోత్సవాలను ఘనంగా ఏర్పాటు చేశారు. సీడీపీఓ జ్యోతి కిరణ్మయి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు ముఖ్యంగా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఇద్దరు కూడా ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. అదేవిధంగా బాలింతలు కూడా మంచి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. వీరితోపాటు సూపర్ వైజార్ అంకమ్మ,ప్రసన్నలు ఉన్నారు.

## ఎమ్మెల్యేను సన్మానించిన కట్టా



నాయుడుపేట, ఆగస్టు 2 ప్రభాతవార్త : శాసనసభ్యులు నెలవల విజయశ్రీని మేనకూరుకు చెందిన తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకుడు కట్టా వెంకట రమణారెడ్డి ఘనంగా సన్మానించారు. నాయుడుపేట పట్టణంలోని గాంధీ మందిరం వద్ద శనివారం మున్సిపార్టీ అధికారులు నిర్వహించిన కొత్త పింఛన్లు పంపిణీకి కార్యక్రమానికి వచ్చేసిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని,మాజీఎంపి నెలవల సుబ్రమణ్యంను కట్టా వెంకటరమణారెడ్డి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ రాష్ట్రంలో పేదవారిని ఆదుకోవాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్‌టిఆర్ భరోసా ద్వార ఫించన్లు పెంచి అందించడం జరుగుతుంద న్నారు. ఈకార్యక్రమంలో మాజీఎంపి నెలవల సుబ్రమణ్యం, మాజీ ఎంసి చేర్మేన్ సిరసనంబేటి విజయ భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి పేరంశెట్టి శ్రీరామ్‌ప్రసాద్, మధురెడ్డి, తెదేపా నాయకులు ఉన్నారు.

## తల్లిపాలే బిడ్డలకు అవసరం : సిడిపిఓ



బాలాయపల్లి, ఆగస్టు2 ప్రభాతవార్త: తల్లిపాలే పురిటి బిడ్డలకు శ్రేయస్కరమని సిడిపిఓ శంషాద్ బేగం తెలిపారు. మండలంలోని వెంగమాంబపురం అంగన్వాడి కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలు పురిటి బిడ్డకు ఇచ్చినందువల్ల బూస్ట్ ఫీడింగ్ ఇచ్చినట్టే ఉంటుందని తెలిపారు. బిడ్డలకు సరైన పోషణ అందుతుందని చెప్పారు. రోగ నిరోధక శక్తి కూడా పిల్లల పెరుగుతుందని తెలిపారు. అనేక రకాలుగా తల్లిపాలు ఉపయోగపడుతుంది అని వివరించారు. సమావేశంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రోటరీ వెస్ట్ క్లబ్‌చే మొక్కలు నాటే కార్యక్రమం



గూడూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త : పట్టణంలో ఏర్పాటై ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాల గ్రౌండ్ ఆవరణలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భ ంగా క్లబ్ అధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి మాట్లా డుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రాఘవరెడ్డి, వాసుగౌడ్, సనత్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, బొమ్మిడి శ్రీనివా సులు, గిరిబాబు, కృష్ణంరాజు, లక్ష్మీనారాయణ, శివకుమార్,కృష్ణారెడ్డి,హెచ్ఎం భారతిలు పాల్గొన్నారు.

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు



గూడూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త : గూడూరులోని చెన్నూరు సెక్టార్‌లోని చెన్నూరు హరిజనవాడలో అంగన్‌వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మహబూబి మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. తల్లిపాలు బిడ్డకు మొదటి టీకా అని బిడ్డ వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. అంగన్‌వాడిలో ఇచ్చే పౌష్టికాహారం లబ్ధిదారులందరూ తీసుకుని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివజ్యోతి, కార్యకర్తలు పి.మేరి ప్రసన్న, జ్యోతి, కామాక్షమ్మ, డి.కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీల నిలువు దోపిడీ ఆపాలి

**-సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్**



గూడూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త: విద్యుత్ చార్జీల నిలువు దోపిడీ ఆపాలని, ప్రమాదకర స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం గూడూరు పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం, సీపీఐ నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలతో ప్రజలు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పుడు స్మార్ట్ మీటర్లను తీసుకువస్తుందని దీనివల్ల ఇంకా ఆర్థికంగా ఇబ్బందులు పడతారని ప్రభుత్వం వెంటనే స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 11వ తేదీ విద్యుత్ కార్యాల యాల వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు వెంకట రామిరెడ్డి, పుట్టా శంకరయ్య, పామంజి మణి, అడపాల ప్రసాద్, గుర్రం రమణయ్య, దారా కోటేశ్వర రావు, ఎంబేటి చంద్రయ్య, బి.చంద్రయ్య, సీపీఐ నాయకులు సి.హెచ్ ప్రభాకర్, శశి కుమార్, రమేష్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల సీట్లుకు దరఖాస్తులు

వాకాడు, ఆగస్టు 2 ప్రభాతవార్త: తిరుపతి జిల్లాలోని వాకాడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాల, కాలేజీలో ఐదవ తరగతిలోను, జూనియర్ కాలేజీ తరగతులలో ఖాళీలు ఉన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అర్హత గల అభ్యర్థులు వారి వివరాలను పాఠశాలలో ఇవ్వాలని తెలిపారు. మరిన్ని వివరాలకు వాకాడు 9704550098, కోట 9441527569 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

## విద్యార్థులచే పర్యావరణ ర్యాలీ



గూడూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త: స్థానిక ఒకటవ పట్టణ పరిధిలో ఉన్న నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో గూడూరు నగర పుర వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలని ఉద్దేశంతో ర్యాలీ నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఒక మొక్కను నాటాలి అన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ దీన్ భవాని, సునీల్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పద్మయ్య, పాఠశాల ఉపాధ్యాయులు మల్లికార్జున, గురు ప్రసాద్, శశి, సంధ్య, శివరంజని, ప్రవీణ, కోటేశ్వరి పాల్గొన్నారు.

## రాష్ట్రంలో సంక్షేమానికి పెద్దపీట : ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, ఆగస్టు 2 ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వెల్లడించారు. శనివారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో నిర్వహించిన నూతన పెన్షన్ల పంపిణీ, అన్నదాత సుఖీభవ కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. రాష్ట్రంలో పెన్షన్లను రూ.4 వేలకు పెంచి అందజేయడమే కాకుండా ప్రస్తుతం నూతనంగా పెన్షన్లను అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రైతులకు వారి బ్యాంకు ఖాతాల్లోకి రూ.5 వేలు జమ చేయడం జరిగిందన్నారు. అలాగే పీఎం కిసాన్ యోజన పథకం కింద మరో రూ.2 వేలు రైతులకు ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, పి.మాధవనాయుడు, ఎజి కిషోర్, దంతాల రవి, వ్యవసాయ అధికారులు కాంచన తదితరులు పాల్గొన్నారు.

## పీఎం కిసాన్ పథకం రైతులకు వరం



వెంకటగిరి,ఆగస్టు 2 ప్రభాతవార్త : పిఎం కిసాన్ పథకం రైతులకు వరం లాంటిదని కృషి విజ్ఞాన కేంద్రం కేంద్రం అధిపతి డాక్టర్ డి శ్రీధర్ తెలిపారు.కృషి విజ్ఞాన కేంద్రం, పెరియవరం, వెంకటగిరి నందు పి.ఎం కిసాన్ సమ్మాన్ నిధిలో భాగంగా రైతుల కొరకు ప్రధాన మంత్రి చేతుల మీదుగా 20వ విడతగా ప్రతి రైతు ఖాతాలో 2000 వితరణ కార్యక్రమాన్ని రైతులకు వీక్షింప చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి. శ్రీధర్, సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ రైతులు వ్యవసాయంలో పెట్టుబడి తగ్గించు కొని ఆదాయాన్ని పెంచుకొనే మార్గాలను విశ్లేషించాలి అని వివరించారు. ప్రకృతి వ్యవసాయం, భుసార పరీక్షా ఆధారిత ఎరువుల యాజమాన్యం, నూనెగింజలు –వివిధ రకాలు, పోషకాధారిత వ్యవసాయ మరియు ఉద్యాన పంటలుపై అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్తలు డా.బి. విజయశ్రీ, డా. పి. నాగార్జున రెడ్డి, డా. డి. తిరుపాల్, డా. ఐ. రాజీవన, వెంకటగిరి మండల వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## రైతులు...ప్రజల జీవితాలు మార్చేది సిఎం : ప్రభుత్వ విప్



కుప్పం, ఆగస్టు 2 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఉన్న రైతులు, ప్రజల జీవితాలను మార్చుతోంది, మార్చ బోయేది సిఎం చంద్రబాబునాయుడేనని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొ న్నారు. శనివారం కుప్పం బస్టాండులో అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా నియోజకవర్గంలో ఉన్న 36368మంది రైతులకు 23.97కోట్ల చెక్కును ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నంతో కలసి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తోంది సిఎం చంద్రబాబేనన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారన్నారు. ఆగస్టు 15న మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం పథకం సైతం సిఎం ప్రారంభిస్తారన్నారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ రైతుల కష్టాలు తెలిసిన రైతు బిడ్డ సిఎం చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, టిడిపి మండల అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, విశ్వనాథనాయుడు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సుధీర్, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, మాజీ ఎంపిపిలు సాంబశివ ం, వెంకటేష్, కౌన్సిలర్లు జిమ్‌దాము, జాకీర్, సురేష్, నేతలు సత్యేంద్రశేఖర్, ఆర్ముగం, మంజునాథ్, శ్యాంసుందర్, జయరాం నాయుడు, ఆర్ఆర్ రవి, ఉమాపతి, నాను, నరేష్, రైతు విభాగం అధ్యక్షుడు చలపతి, కార్యదర్శి గోపాల్, మహిళా నేతలు తిరుమగళ్, భాగ్యలక్ష్మి త్రిలోక్, గీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పరిష్కారానికి ప్రత్యేక ప్రజా దర్బార్ : జిల్లా కలెక్టర్



శ్రీకాళహస్తి రూరల్,ఆగస్టు 2 ప్రభాతవార్త: నియోజకవర్గంలో భూ సమస్యలు లెక్కలేనన్ని ఉన్నాయని వాటిని పరిష్కరించుటకు ఈ నెల 11న ప్రత్యేక రైతు దర్బార్‌ను నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరన్ ప్రకటిం చారు. శనివారం శ్రీకాళహస్తిలో అన్నదాత సుఖీ భవ చెక్కుల పంపిణి కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. హాజరైన రైతులు శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డిని ప్రశ్నల వర్షం కురిపించారు.దాంతో వేదికపై ఉన్న కలెక్టర్‌ను ఎంఎల్‌ఏ పరిష్కారమే మిటని ప్రశ్నించారు. వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ తేదీ ఖరారు చేసారు. రైతులు శాసనసభ్యుని సమస్యల వర్షం కురిపించగా స్పందించి ఈ సమస్యలను పరిష్కరించకపోతే తనను ప్రజలు చేతకాని ఎంఎల్‌ఏగా చూస్తారంటే కలెక్టర్‌కు వివరించారు. నియోజకవర్గంలోని ముసలిపేడు, ఎంపేడు, చిట్టత్తూరు, బోనుపల్లి, చియ్యవరంలోని రైతులు నిత్యం తన వద్దకు వచ్చి తమ అధీనంలో ఉన్న భూమి తమ పేరు లేదని మరొకరి పేరు మీద మారిపోయిందని ఫిర్యాదు చేస్తున్నారని చెబుతున్నారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ఈ నెల 11న శ్రీకాళహస్తిలోనే ప్రత్యేక రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేసి అక్కడిక్కడే సమస్యను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

## ఘనంగా ప్రారంభమైన పోతురాజులు కొలుపు



పెళ్లకూరు,ఆగస్టు 2 ప్రభాతవార్త : మండలంలోని రావులపాడు గ్రామంలో శనివారం నాడు పోతురాజుల కొలుపు ఘనంగా ప్రారంభించారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా నిర్వహించే ఈ పోతురాజులు కొలుపును గ్రామ ప్రజలంతా తమ బంధువులు స్నేహితులు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకుంటారు. ఇందులో భాగంగా మొదటి రోజు పోతురాజు స్వామి గ్రామ ఊరేగింపుతో ప్రారంభమై ఆదివారంనాడు జరిగే పొంగళ్ల సమర్పణతో ముగియనుంది. ఈ సందర్భంగా రైతు విభాగ అధ్యక్షుడు కేవీ నాయుడు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా గ్రామ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆ పోతురాజుల స్వామి కరుణా కటాక్షాలు మా గ్రామప్రజలపై ఉండాలని ఈ వేడుకను జరుపుకుంటున్నామన్నారు.

## రైతుల ఖాతాలోకి రూ.25.83కోట్లు :జాయింట్ కలెక్టర్



పలమనేరు టౌన్, ఆగస్టు 2 ప్రభాతవార్త: అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పలమనేరు నియోజక వర్గంలో 38368 మంది రైతుల బ్యాంకు ఖాతాలోకి రూ.25.83కోట్లు నగదు జమచేయడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి తెలిపారు. పలమనేరు మండలంలోని పెంగరగుంట గ్రామంలో నిర్వహిం చిన అన్నదాత సుఖీభవ కార్యక్రమం ఆమె పాల్గొన్నారు.ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పలమనేరు నియోజకవర్గంలోని 383 68 రైతుల ఖాతాలో రూ.25.83 కోట్లు నగదు జమచేయడం జరిగింద న్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని,నూతన పద్ధతులలో ఆధునిక వ్యవసాయంపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి,ఆర్డీఓ భవాని,తహసీల్దార్ ఇన్బనాదన్,ఎంపిడిఓ భాస్కర్,టిడిపి అధ్యక్షులు నాగరాజురెడ్డి,సింగల్ విండో ఛైర్మన్ వెంకట మునిరెడ్డి,ప్రధాన కార్యదర్శి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మరాజుల స్వామి ఆలయంలో ధ్వజారోహణం



శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 2 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం పాపా నాయుడుపేటలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా 155వ బ్రహ్మోత్సవాలు ప్రారంభమ య్యాయి. ఆలయంలో ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 15 వరకు జరిగే కార్యక్రమాల్లో ఈ నెల 8న అర్జునతపస్సుకు వేలాది మంది పాల్గొననున్నారు. 10న అగ్నిగుండం కార్యక్రమాలకు జిల్లాలోని దేవాదాయశాఖ,రెవెన్యూ శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమాలకు వళ్ళత్తూరు త్యాగరాజు కుటుంబ సభ్యులు పురవీధుల్లో ఊరేగించారు. పూజారి రామేష్‌శర్మ, రవితేజల సారథ్యంలో ధ్వజారోహణం నిర్వహించారు.

## భద్రతాపరంగా సన్నద్ధమవుదాం : సివిఎస్ఓ



తిరుమల,ఆగస్ట్ 2ప్రభాతవార్తప్రతినిధి:సెప్టెంబర్ 23 నుండి జరిగే సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తుల భద్రతతోబాటు వాహనాల పార్కింగ్‌పై ముందుగానే దృష్టిసారించాలని టిటిడి సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి తిరుమలలోని ప్రతి ప్రాంతంపై మరింత నిశితంగా టెక్నాలజీతో నిఘా ఉంచి భద్రతను పటిష్టం చేయాల న్నారు. అన్నమయ్య భవనంలో సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ విజిలెన్స్ అధికారులతో సమావేశమయ్యారు. టిటిడి విఎస్ఓలు ఎన్టీవిరామ్ కుమార్, సురేంద్ర, ఏవిఎస్ఓలు,విఐలతో సుదీర్ఘంగా చర్చించారు.

## కాణిపాకంలో వైభవంగా ద్రౌపదమ్మ తిరునాళ్ళు



కాణిపాకం, ఆగస్టు 2 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో వెలసిన శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో ద్రౌపదమ్మ తిరునాళ్లను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు గ్రామస్థుల ఆధ్వర్యంలో తిరునాళ్లను నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున మంగళ వాయిద్యాలు, వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ఊరేగింపుగా వెళ్ళి ఆలయం వద్ద పొంగళ్ళు పెట్టి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమ ంలో స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డి, బాలకృష్ణలతో పాటు కాణిపాకం పరిసర గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

## ఆలయంలో కీలక ఘట్టం అగ్ని ప్రవేశం



తిరుపతిరూరల్, ఆగస్టు 2ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం దుర్గసముద్రం గ్రామ పంచాయతీలో శ్రీద్రౌపతి సమ్మేత ధర్మరాజుల మహాభారత ఉత్సవాలు వైభవంగా జరుగుతున్న విషయం తెల్సిందే. మహాభారత ఉత్సవాలలో చివరి ఘట్టమైన 'అగ్నిగుండ' ప్రవేశానికి తిరుపతిరూరల్ పరిసర, చంద్రగిరి నియోజక వర్గ ప్రజలు భారీగా తరలివస్తారని ఆలయ ధర్మకర్త, గ్రామ సర్పంచ్ మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి అగ్నిగుండ ప్రవేశానికి భారీ ఎత్తున ప్రజలు తరలిరానున్నారని తెలిపారు. అగ్నిగుండ ప్రవేశానికి భక్తులకు తగ్గా భారీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అలాగే ఆదివారం ఉదయం దుర్యోధన వధ ఘట్టం ఉంటుందని తెలిపారు.

## అమ్మవారిని దర్శించుకున్న...కేంద్రమంత్రి గడ్కరీ



తిరుచానూరు,ఆగస్టు 2 ప్రభాతవార్త: కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ శనివారం ఉదయం తిరుచానూరు పద్మావతి అమ్మవారిని కుటుంబంతో కలిసి దర్శించు కున్నారు. ఆలయం వద్ద రాష్ట్రమంత్రి రాంప్రసాద్‌రెడ్డి, టిటిడి ఈఓ శ్యామల రావు, జెఈఓ వీరబ్రహ్మం, అమ్మవారిఆలయ డిప్యూటీ ఈఓ పి.హరీంద్రనాథ్ కేంద్రమంత్రికి స్వాగతం పలికి దర్శనం చేయించారు. అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకుడు బాబుస్వామి, టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, బిజెపి సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గుండాల గోపీనాధరెడ్డి,గాలిపుష్పలత కేంద్రమంత్రి వెంట ఉన్నారు.

## పిఆర్సీ కమిటీని వెంటనే నియమించాలి

తిరుపతిరూరల్,ఆగస్టు 2 ప్రభాతవార్త: ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగులందరికి వెంటనే ఐఆర్ ప్రకటించి, 12వ పిఆర్సీ కమిటీని వెంటనే అమలు నియమిం చాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేసారు. ఈ మేరకు శనివారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఉపాధ్యాయులపై యాప్ రూపంలో ఉన్న పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేసారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎస్‌టిఎఫ్ అధ్యక్షులు కత్తి నరసింహారెడ్డి, ప్రధాన కార్యధర్శి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిసాగరంలో నగరసంకీర్తన

తిరుపతి రవాణ, ఆగస్టు 2 ప్రభాతవార్త: శనివారం వేకువజామున ఆధ్యాత్మిక నగరం తిరుపతి గోవింద నామస్మరణతో ప్రతి ధ్వనించింది. తిరుపతి ప్రజల్లో భక్తిభావం పెంపొందింపజేసేందుకు ప్రతి శనివారం ఉదయం రాయలసీమ రంగస్థలి కళాకారులు చేపట్టిన నగరసంకీర్తన యాత్రికుల్లో, నగరవాసుల్లో మరింత ఆధ్యాత్మికత ఉట్టిపడేలా చేస్తోంది. రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, కళాకారులు తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, మునినాధరెడ్డి, కస్పాపద్మనాభమ్, శాంభోలుహరి,విక్రమ్‌స్వామి, నరసింహారెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి, మేకల గంగయ్య, సురేంద్రరాజు, పద్మావతి, జయమ్మ, కళ . విగ్రహాల కల్యాణి, మురళీరెడ్డి, వందమంది కళాకారులు భజనలు చేసుకుంటూ ఆధ్యాత్మిక చింతనతో కదిలారు.